www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

ఆదివారం | 25 | మే | 2025

పేజీలు 8

## అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



-నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

-మైనర్ బ్రిడ్జి, రోడ్ల పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన

2లో

# క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరు గిరిప్రసాద్



-ట్రంప్ ముందు మోకారిల్లుతున్న మోడీ

-సిద్ధాంతాన్ని చంపేయడం అమిత్‌షా తరం కాదు

-సిపిఐ జాతీయ కార్యదర్శి, నారాయణ

-మావోయిస్టులు ఈ దేశ పౌరులు కారా

-వామపక్ష, లౌకిక శక్తుల ఐక్యతే సరైన ప్రత్యామ్నాయం

-కూనంనేని







**ప్రజాపక్షం/ఖమ్మం :** క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరుగా దివంగత సిపిఐ నేత, సాయుధ పోరాట యోధుడు నల్లమల గిరిప్రసాద్ నిలిచారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ తెలిపారు. తుది శ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమ నిర్మాణం కోసం పరితపించిన మహోన్నతుడని ఆయన కొనియాడారు. గిరిప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. అనంతరం రిక్కాబజార్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో శనివారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ గిరిప్రసాద్ ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

దేశంలో సంక్లిష్ట పరిస్థితి

మిగతా 2లో..

## పాలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6500 కోట్లు వడ్డీలు కడుతూ ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు జోడెడ్లలాగా నడిపిస్తున్నామని పాలేరు శాసనసభ్యులు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం తిరమలాయపాలెం మండలంలోని అజ్మీరతండా, రాకాసి తండా, పాతర్లపాడు, మహ్మదాపురం, తెట్టెలపాడు గ్రామాల్లో సిసి రోడ్లు, బిటి

- అర్హులైన ప్రతిపేదవాడికి దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు
- బిటి, సిసి రోడ్లకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.100 కోట్ల పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో

మిగతా 2లో..

## ప్రణాళికాబద్ధంగా యువతకు ఉపాధి కల్పన







-భవిష్యత్ అవసరాలకనుగుణంగా విద్యుత్ ప్రాజెక్టులు

-రూ.100కోట్లతో రాజీవ్ కెనాల్ పూర్తి

-రూ.9వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం

-వైరా జాబ్‌మేళాలో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**ప్రజాపక్షం/వైరా:** యువతకు ఉపాధి కల్పనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. 5వేలకు పైగా మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో వైరా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి శుక్రవారం రాష్ట్ర డిప్యూటీ సిఎం, ఆర్థిక ఇందనశాఖ మంత్రివర్యులు భట్టివిక్రమార్క మల్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క మల్లు మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 2050 సంవత్రాలకు అనుగుణంగా విద్యుత్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడాల

నేదే ఇందిరమ్మ ఆపలన ధ్యేయం

మిగతా 2లో..

# క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరు గిరిప్రసాద్





(మొదటిపేజీ తరువాయి)

నెలకొందని మావోయిస్టుల పేరుతో అమాయక గిరిజనుల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు. అమిత్‌షా ప్రకటించినట్లుగా మావోయిస్టు నిర్మూలన 2026 మార్చి 31 కాదు కదా ఎన్నటికి అది సాధ్యం కాదని నారాయణ తేల్చి చెప్పారు. సిద్ధాంతాన్ని ఆచరిస్తున్న కొంత మందిని హత్య చేయడం సాధ్యమేమో కాని సిద్ధాంతాన్ని చంపేయడం అంత తేలిక కాదని అదే సమయంలో మావోయిస్టులు సైతం తమ పంథాను మార్చుకోవాలన్నారు. నాడు సాయుధ పోరాటంలో వేల మందిని హతమార్చారని గిరిప్రసాద్‌ను సైతం హతమార్చాలని ప్రయత్నించినప్పుడు తుపాకి గుండుకు ఎదురొడ్డి నిలిచారని నారాయణ తెలిపారు. ఈ దేశంలో టెర్రరిస్టుల పట్ల మోడీ మెతక వైఖరిని అవలంభిస్తూ మావోయిస్టుల విషయంలో మాత్రం సరిహద్దు సైన్యాలను దింపి అంతమొందించాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మేము శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నా ఎందుకు చర్చలు జరపడం లేదన్నారు. ప్రశ్నించే వారిని చంపేస్తూ నియంత పాలన వైపు మోడీ అడుగులేస్తున్నారని ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమన్నారు. మేము యుద్ధం వద్దంటే దేశ ద్రోహులన్నారని మరి యుద్ధం ఆపిన మోడీ సర్కార్ ను ఏమనాలని నారాయణ ప్రశ్నించారు. ఈ దేశ రాజ్యాంగానికి మావోయిస్టుల నుంచి కానీ మరే ఇతరుల నుంచి కానీ ప్రమాదం లేదని ఆ ప్రమాదం బిజెపి వైపు నుంచి మాత్రమే పొంచి ఉందన్నారు. ఈ దేశంలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థల పైన మోడీ, అమిత్‌షాలు దాడి చేస్తున్నారని సుప్రీం కోర్టును ప్రశ్నించింది కూడా ఉప రాష్ట్రపతి బిజెపి వారేనని ఆయన తెలిపారు. ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేస్తూ దేశంలో లౌకిక, ప్రజాతంత్ర శక్తుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారని ఆయన తెలిపారు.ఈ దేశంలో కులగణన 2029 నాటికి పూర్తి చేయాలని ఈ దేశ చట్టసభలలో బిసిలకు రిజర్వేషన్ కల్పించాలని నారాయణ డిమాండ్ చేశారు. ఒకపక్క పన్నుల భారం మోపుతూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మరో పక్క గుజరాత్‌కు చెందిన ఆర్థిక టెర్రరిస్టులు రూ. 16లక్షల కోట్లు ఎగవేస్తే ఈ మోడీ ప్రభుత్వం ఏమి చేసిందన్నారు. 29 మంది ఆర్థిక టెర్రరిస్టుల్లో 28 మంది గుజరాత్ వారేనని అందులో ఏడుగురు మోడీ ఇంటి పేరు కలిగిన వారేనని నారాయణ తెలిపారు. ఆర్థిక ఉగ్రవాదులు టెర్రరిస్టుల కంటే ప్రమాదమని ఆయన తెలిపారు. నియంత పాలనకు ప్రయత్నాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజా చైతన్యానికి కృషి జరగాలని వామపక్ష లౌకికశక్తుల ప్రత్యామ్నాయం మాత్రమే దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడగలదన్నారు. రాజకీయం వ్యాపారమైందని రాజకీయ పార్టీల్లో అంతర్గత విబేధాలను సృష్టించి లబ్ది పొందేందుకు బిజెపి ప్రయత్నిస్తుందన్నారు. అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వామపక్ష ఉద్యమం బలపడాలని నారాయణ పిలుపునిచ్చారు.

**మావోయిస్టులు ఈ దేశ పౌరులు కారా : కూనంనేని**

మావోయిస్టులు ఈ దేశ పౌరులు కారా శాంతి చర్చలకు సిద్ధమంటే ఎందుకు ప్రభుత్వం స్పందించడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ప్రశ్నించే వారిని బిజెపి ప్రభుత్వం హతమారుస్తుందని ఆయన ఆరోపించారు. గిరిప్రసాద్ 29వ వర్ధంతి సభలో కూనంనేని మాట్లాడుతూ నాడు నైజం రక్కసి మూకలు ఐదువేల మందిని హతమార్చారని నాడు నిజాం ప్రభుత్వం ఏవిధంగా పట్టుకొచ్చికాల్చి చంపిందో ఇప్పుడు బిజెపి ప్రభుత్వం అదే పంథాను అనుసరిస్తుందన్నారు. నేరస్తులు, ఆర్థిక అరాచవాదులు సమాజంలో పెద్ద మనుషులుగా చెలమణి అవుతుంటే ప్రశ్నించే వారు ఏదో ఒక రూపంలో చంపబడటమో, జైళ్లలో ఉండటమో జరుగుతుందని ఆయన తెలిపారు. అమిత్‌షా దాహం ఎంత మందిని చంపితే తీరుతుందని కూనంనేని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సైతం మావోయిస్టులతో చర్చలు జరిపేది లేదంటున్నారని పని చేయాలనుకున్న ఆలోచనను, సిద్ధాంతాన్ని చంపేయడం ఎవరి తరం కాదన్నారు. ఈ దేశంలో అతిపెద్ద క్రిమినల్‌గా చెప్పుకునే అమిత్‌షా ప్రజాస్వామ్యం గురించి రాజ్యాంగ భద్రత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయన తెలిపారు. కా॥ గిరిప్రసాద్ లాంటి అనేక మంది యోధుల వారసత్వంతో ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని కూనంనేని పిలుపునిచ్చారు. ఈ దేశ శత్రువులతో పోరాటం సాగించలేని పాక్ అక్రమిత కశ్మీర్‌ను దేశంలో విలీనం చేయలేని మోడీ తన సైన్యాలతో మధ్య భారతంలో ఆదివాసీలపై అంతర్గత యుద్ధం చేస్తున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ చైతన్యానికి ప్రతీక అని ఈ గడ్డ పైన మతోన్మాదానికి, కుల మత రాజకీయాలకు స్థానం లేదని ఆయన స్పష్టం చేశారు. డిసెంబరు 26న భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు సభ ఖమ్మంలో జరగనుందని ఐదు లక్షల మందితో ఖమ్మంలో కమ్యూనిస్టుల సత్తా ఏమిటో చూపాలని ఆయన కోరారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో పోరాటాల్లో కాస్త వెనుకబడినా మరోసారి జూలు విదిల్చి ప్రజల పక్షాన పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా పోరాటాలే అమరులకు సరైన నివాళి అని ఆయన తెలిపారు. ఈ సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెంజిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా తదితరులు ప్రసంగించారు. సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ములజి తేందర్‌రెడ్డి, మిరియాల రంగయ్య, యర్రాబాబు, గిరిప్రసాద్ తనయుడు నల్లమల చక్రవర్తి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, బిజి క్లైమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి , తోట రామాంజనేయులు, ఏపూరి రవీంద్రబాబు, మందడపు రాణి, మిడికంటి వెంకట రెడ్డి, రావి శివరామకృష్ణ, అజ్మీర రామ్మూర్తి, జాగర్లమూడి రంజిత్‌కుమార్, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, ప్రజా సంఘాల నాయకులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, మదుపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సభకు ముందు కా॥ గిరిప్రసాద్ సహా అమరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# ప్రణాళికాబద్ధంగా యువతకు ఉపాధి కల్పన





(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ఉద్యోగ మేళాలో 80కు పైగా కంపెనీల ప్రతినిధులు ముందుకు వచ్చారని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అన్ని మార్గాలు అన్వేషించి అమలు చేస్తున్నామని అన్నారు. రాజకీయాలకు అతీతంగా మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, దీనిని అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. యువత వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని, చిన్న ఉద్యోగం అయినా ముందు జాయిన్ కావాలని, ప్రతి నిముషం విలువైందని, ఉద్యోగం చేస్తూ కూడా యువత తమ అభివృద్ధి లక్ష్యాల సాధన కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉండాలని డిప్యూటీ సిఎం సూచించారు. యువత అనేక ఆశలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొందని, కోరి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత పాలకులు గ్రూప్1 పరీక్షలు నిర్వహించలేకపోయారని, యువతకు ఉపాధి అవకాశాలు చూపించడంలో వైఫల్యం చెందారని అన్నారు. వైరా నియోజకవర్గ పరిధిలో మెగా జాబ్‌మేళా కార్యక్రమంలో 8వేలకు పైగా యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వీరిలో చాలా మందికి నేడు ఉపాధి లభిస్తుందని అన్నారు. వైరా నియోజకవర్గ పరిసరాల్లో ఉన్న నాగార్జునసాగర్, కాల్వ వైరా చెరువు, ఇతర చెరువకుల సంవృద్ధిగా నీరు అందించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం క్రింద ప్రత్యేకంగా రాజీవ్ కెనాల్‌ను రూ.100కోట్లతో పూర్తి చేశామని అన్నారు. వైరా చెరువు కాల్వల పునరుద్ధరణ కోసం రూ.44కోట్లు మంజూరు చేశామని అన్నారు. చిన్న నీటి బొట్టు వదలకుండా రైతుల పొలాలకు సాగునీరు మళ్లించేలా చర్యలు చేపట్టామని డిప్యూటీ సిఎం తెలిపారు. కాంగ్రెస్ వస్తే కరెంటు కష్టాలు అన్న నేతల కళ్ళు ఎక్కడ పెట్టుకొని చూస్తున్నారని, ఎక్కడ కరెంటు పోవడం లేదని ఆయన గుర్తు చేశారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సింగరేణి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహణ చాలా సంతోషంగా ఉందని అన్నారు. జాబ్‌మేళాకు దాదాపు 8వేల మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకుందని, దాదాపు 5వేల మందికి యువతకు కంపెనీ ఉద్యోగ అవకాశాలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని, జాబ్‌మేళాలలో వచ్చిన ఉద్యోగాల్లో ఎటువంటి సమస్య వచ్చినా అవసరమైన సహకారం జిల్లా యంత్రాంగం నుంచి అందిస్తామని అన్నారు. మెగాజాబ్‌మేళా నిర్వహణలో సహకరించిన డిప్యూటీ సిఎంకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూలో ఎంపికైన యువతకు వివిధ కంపెనీల ఆఫర్ లెటర్‌లను డిప్యూటీ సిఎం అందజేశారు. ఈ మెగా ఉద్యోగ మేళాలలో ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సింగరేణి సిఎండి బలరాం, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, సింగరేణి జనరల్ మేనేజర్ శాలోమ్‌రాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, కోట్ల నాగేశ్వరరావు, బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిలరెడ్డి, కట్ల రంగారావు, నూతి సత్యనారాయణ, సూతకాని జైపాల్, ఏదునూరు సీతారాములు, దొబ్బల సౌజన్య, కట్ల సంతోష్, పమ్మి అశోక్, మిట్టపల్లి నాగి, దార్న రాజశేఖర్, వీరంశెట్టి సీతారాములు,యూత్ కాంగ్రెస్ నాయకుడు గరిడేపల్లి కిషోర్, బోళ్ళ గంగారావు, పల్లపు కొండలు, బత్తుల గీత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అభివృద్ధి పనులు వర్షాకాలం నేపథ్యంలో సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండలం కోటపాడు గ్రామంలో ఎస్సి కాలనీ నందు సిఆర్ఆర్ (ఎస్‌సిపి) నిధులు రూ. 20 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు, ఎఫ్‌డిఆర్ నిధులు రూ. 99 లక్షల అంచనా వ్యయంతో కోయచలక, కోటపాడు రహదారిపై చేపట్టిన మైనర్ బ్రిడ్జి పునర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సిసి రోడ్లు, డ్రైన్లు, మైనర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వర్షాకాలం లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతేడాది కురిసిన వర్షాలకు కోయచలక, కోటపాడు మధ్య ఉన్న రహదారి కొట్టుకుపోయిందని దానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ. 99 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఆయన తెలిపారు. రైతులు వైవిధ్యమైన పంటలను సాగు చేయాలని సూచించారు. గ్రామంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, పిఆర్ ఎస్‌ఈ వెంకటరెడ్డి, తహసీల్దార్ శ్వేత, ఎండివో అశోక్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, నాయకులు కొంటెముక్కుల నాగేశ్వరరావు, బాతుల రమణసుధాకర్, వాంకుడోత్ దీప్లానాయక్, నరేష్, అరిఫ్, రమేష్, చెరుకూరి పూర్ణచందర్‌రావు, బండి వెంకన్న, మాధంశెట్టి హన్మంతరావు, ఉయ్యూరి వెంకటనారాయణ, నెల్లూరి చంద్రయ్య, బండి రమాదేవి, రామ్మూర్తి, దేవ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృఢ సంకల్పంతో ఉన్నారని, రాష్ట్రంలో గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6500కోట్ల వడ్డీలు కడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటూ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, రూ.500 గ్యాస్ సబ్సిడీ విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు, నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్‌కార్డులు, రైతులకు ధాన్యం బోనస్ రూ.500, నిరుద్యోగులకు రాజీవ్ వికాసంతో స్వయం ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందించారు. పాలేరు నియోజకవర్గంలో సీతారామ ఎత్తిపోతలతో డోర్నకల్ మున్నేరు వరదను సీతారామ గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించి పాలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని అన్నారు. మండలంలోని రాకాసి తండా నుండి మన్నెగూడెం వరకు రూ.375లక్షలతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు, పాతర్లపాడు క్రాస్ రోడ్డు నుండి రావిచెట్టు తండా రోడ్డు వరకు రూ.27కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు, మహ్మదాపురంలో బోడదంత నుండి సుబ్లేడు, మేడిదపల్లి రోడ్డు నుండి భవాని గుడి వరకు రూ.315లక్షలతో బిటి రోడ్డు, తెట్టెలపాడు గ్రామంలో ఏడు అంతర్గత సిసి రోడ్లు, గోపాలపురం నుండి జల్లేపల్లి వరకు రూ.38కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు, చిన్నపోచారం నుండి కృష్టాపురం తాళ్ళ చెరువు జెడ్పి రోడ్డు వరకు రూ.280లక్షలతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జీళ్ల చెరువు గ్రామంలో సూర్యాపేట అశ్వారావుపేట రోడ్డు నందు రూ.50లక్షలతో సిసి డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్ఇ యాకుబ్, పిఆర్ ఎస్ఇ వెంకట్‌రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్‌డిఓ నర్సింహారావు, ఎడిఎ సరతి, భారీ నీటిపారుదల శాఖ డిఇ బాణాల రమేష్‌రెడ్డి, తహశీల్దార్ లూథర్ విల్సన్, ఎండిపిడో సిలార్ సాహెబ్, పాలేరు డివిజన్ ఆత్మ కమిటీ ఛైర్మన్ చావా శివరామకృష్ణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను శరవేగంగా పూర్తి చేసుకోవాలి





**ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ ప్రభుత్వం సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. మండలం లోని చెరువుమాధారం, బుద్ధారం, నేలకొండ పల్లి, గువ్వలగూడెం గ్రామాలలో శనివారం పర్యటించారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను అమలు చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలు శర వేగంగా పూర్తి చేయాలని సూచించారు. వర్షాలు పడుతున్నందున్న రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించే సమయంలో ప్రభుత్వం "విత్తనాలు సరఫరా చేస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతాంగం కోసం అనేక సంకేమ పద కాలు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ కు దక్కుతుందని అన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నందున్న అభివృద్ధి ఫలాలు జిల్లా కు ఎక్కువగా అందుతున్నాయని అన్నారు. పార్లమెంట్ పరిధిలో రూ.14 కోట్ల తో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రణాళిక, ప్రకారం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి కార్యకర్తలందరికీ అండగా నిలుస్తామని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, వెంకన్న, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, బాలాజీ, భద్రయ్య, జెర్రిపోతుల సత్య నారాయణ, మామిడి సుభద్ర, కడియాల నరేష్, వద్దె జగన్, మేకల వెంకటేశ్వర్లు, గుండా బ్రహ్మం, హనుమంతరావు, కొమ్మినేని విజయ్, కైలాసపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**- ఇందిమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాగమయి**



**ప్రజాపక్షం/ తల్లాడ :** పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన సాగుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శనివారం సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ ఆర్‌బి గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో మండలంలోని 525మంది పేదకుటుంబ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ నిర్మాణంలో భాగంగా తల్లాడ మండలంలోని అర్హులైన పేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయటం జరుగుతుందని తెలిపారు. పేదింటి ప్రజలు పది సంవత్సారాల నిరీక్షణ తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం పేదవాడి ఇంటి కల నెరవేర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గృహ నిర్మణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ళు నిర్మాణం చేసుకోవటానికి మనందరం ఒక పండుగలాగా, కాంగ్రెస్ కుటుంబసభ్యులు లాగా ఇందిమర్మ పట్టాలు తీసుకుంటున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. తల్లాడ మండలంలో పైలెట్ ప్రాజెక్టు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతున్న సందర్భంగా వారికి మొదటి విడత రూ1లక్ష జమ చేయటం జరిగిందని, ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియలో సత్తుపల్లి నియోజకవర్గం అగ్రగ్రామిగా ఉందని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకి, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రజలందరూ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్, పిఎసిఎస్ చైర్మన్ తూము వీరభద్రరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రఘుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు కిరణ్, రాయల రాము, గుర్రం శ్రీను, హౌజింగ్‌శాఖ అధికారులు, పంచాయతీల ఇందిరమ్మ కమిటీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# జెఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీచైతన్య అగ్రస్థానం



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష అయిన జెఈఈ మెయిన్ పేపర్ 2లో (బిఆర్క్, బి ప్లానింగ్) పరీక్షా ఫలితాల్లో శ్రీచైతన్య కళాశాల ఖమ్మం విద్యార్థులు వివిధ కేటగిరిలలో ఆలిండియా ర్యాంకులు సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. శనివారం ప్రకటించిన ఫలితాల్లో పి. సాయి కుమార్ ఆలిండియా 55వ ర్యాంకు, ఎ. గోవర్ధన్ ఆలిండియా 129వ ర్యాంకు సాధించినట్లు వారు తెలిపారు. వీటితో పాటు వివిధ కేటగిరిలలో వరుసగా 55, 85, 129, 210, 275, 292, 292, 339, 368, 493, 570, 594, 620, 710, 712, 728, 751, 778, 892, 918, 953, 982 వంటి ఆలిండియా 1000లోపు ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ మారుతున్న పరీక్షా విధానాలకు అనుగుణంగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే తులనాత్మక విద్యా ప్రణాళికతో పాటు రాష్ట్రంలోనే బెస్ట్ లెక్చరర్లచే విద్యా బోధన అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్‌తో పాటు డైరెక్టర్ శ్రీవిద్య, అకాడమిక్ డైరెక్టర్ సాయిగీతిక లు అభినందించారు. ఈ కార్యక్రమంలో డిజిఎం సిహెచ్ చేతన్ మాథుర్, ఎగ్జిక్యూటీవ్ డీన్ ఎన్ఆర్ఎస్‌డి వర్మ, డిన్ జె. కృష్ణ, ఎజిఎంలు సిహెచ్ బ్రహ్మం, జి. ప్రకాష్, జి. గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

# బిఆర్క్, ప్లానింగ్ ఫలితాల్లో హార్వెస్ట్ ప్రభంజనం



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** దేశ వ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆర్కిటెక్చర్, ప్లానింగ్ విద్యనభ్యసించుటకు ఎన్‌టిఏ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెయిన్స్ బి ఆర్క్, ప్లానింగ్ పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా టాప్ ర్యాంకులు సాధించినట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల యాజమాన్యం తెలిపింది. శనివారం ప్రకటించిన ఫలితాల్లో వివిధ కేటగిరిల్లో తమ కళాశాల విద్యార్థిని జస్వంత్ సాయి 38వ ర్యాంకు సాధించి అగ్రస్థానంలో నిలిచారన్నారు. బి. సాయిచరణ్ 50వ ర్యాంకు, బి. సంజయ్ 86వ ర్యాంకు, ఎం. నాగయశ్వంత్ 117వ ర్యాంకు, వై. సాయినేహా 128వ ర్యాంకు, బి. ప్రణీత 141వ ర్యాంకు, వేముల సాయిదీపక్ 206వ ర్యాంకు, పి. క్రిష్ సాత్విక్ 225వ ర్యాంకు, వి. శరణ్ గోపాల్ స్వామి 253వ ర్యాంకు, ఎన్. రాఘవేంద్ర నవనీత్ 302వ ర్యాంకు కందుల రోహిత 346వ ర్యాంకు కమతం విన్య 363వ ర్యాంకులు సాధించారన్నారు. ప్లానింగ్ విభాగంలో వేముల సాయిదీపక్ 64వ ర్యాంకు, వై. సాయినేహా 856వ ర్యాంకులు సాధించారని వారు వివరించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్. పార్వతిరెడ్డి లు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించారని వారు ఆకాంక్షించారు.


# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఆర్థిక సాయం కోసం ఎంపి వద్దిరాజు రవిచంద్ర సిఫారసు మేరకు లబ్దిదారులకు మంజూరైన రూ.2.50 లక్షల చెక్కులను శనివారం బుర్హాన్‌పురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపి వద్దిరాజు రవిచంద్ర పంపిణీ చేశారు. అనారోగ్యాలతో బాధపడుతున్న బాధితులు, కుటుంబ సభ్యులతో ఎంపి వద్దిరాజు రవిచంద్ర మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరభద్రం, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# పాలిసెట్ ఫలితాల్లో న్యూవిజన్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్





**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** పాలిసెట్ 2025 ఫలితాల్లో నగరంలోని న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు తూమాటి లాస్యశ్రీ 150కి 150 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. అదేవిధంగా పాఠశాలకు చెందిన కోట సాత్విక స్టేట్ 19వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మైఖేల్ తెలిపారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ, డిప్లొమా కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహించిన పాలిసెట్ పరీక్షా ఫలితాల్లో తుమాటి లాస్యశ్రీ ఎంపిసి, ఎంబైపిసి రెండు స్ట్రీమ్‌ల నుంచి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిందన్నారు. ఎస్ఎస్‌సి ఫలితాల్లో స్టేట్ టాప్ మార్కులు సాధించిన న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు పాలిసెట్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకు సాధించడం ఎంతో గర్వంగా ఉందని పాఠశాల చైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్ తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపకులకు, సహకరించిన తల్లిదండ్రులకు ఈ సందర్భంగా వారు అభినందనలు తెలిపారు.

# పాలిసెట్‌లో త్రివేణికి స్టేట్ ర్యాంకులు




**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** పాలి సెట్ ఫలితాల్లో ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్టేట్ ర్యాంకులు సాధించారు. శనివారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన సరయు 120 మార్కులకు గాను 109 మార్కులతో రాష్ట్ర స్థాయి 187వ ర్యాంకు, ప్రణవి 106 మార్కులతో 339వ ర్యాంకు, వెంకటవర్షిత్ 107 మార్కులతో 481వ ర్యాంకు, చరిత 103 మార్కులతో 529వ ర్యాంకు, శాహిస్త 99 మార్కులతో 1340వ ర్యాంకు, మన్విత 94.5 మార్కులతో 1357వ ర్యాంకు, హమ్సిక 91 మార్కులతో 1823వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. నలుగురు విద్యార్థులు 100కు పైగా మార్కులు, ఎనిమిది మంది విద్యార్థులు 90కు పైగా మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్రచౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సిఆర్‌వో కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, చార్లెస్, అశోక్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

# మండలంలో పాలిటెక్నిక్‌లో అరుణోదయ స్కూల్ విద్యార్థిని టాపర్



**ప్రజాపక్షం/పెనుబల్లిః** పాలిసెట్ లో వియం బంజర్ అరుణోదయ మెరిట్ స్కూల్ విద్యార్థిని యర్ర నూక శ్వేత చంద్ర స్టేట్ ర్యాంక్ సాధించింది. పెనుబల్లి మండలం పాత కుప్పెనకుంట్ల గ్రామం జానకి పురానికి చెందిన శ్వేత చంద్ర అరుణోదయ మెరిట్స్ స్కూల్లో పదవ తరగతి వరకు చదివి అక్కడే పాలిసెట్ కి ప్రిపేర్ అయింది. 202425 సంవత్సరం పాలిసెట్ లో 268 స్టేట్ ర్యాంక్, మండల ఫస్ట్ ర్యాంక్ సాధించి ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా అరుణోదయ మెరిట్ స్కూల్ డైరెక్టర్ శంకర్, ప్రిన్సిపల్, అధ్యాపక సిబ్బంది శ్వేత చంద్రకు అభినందనలు తెలిపారు.

# తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారీపడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన కూసుమంచిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మందా వెంకన్న (58) గ్రామశివారులో ఉన్న తాటిచెట్టు ఎక్కి దిగుతుండగా మోకు జారీ చెట్టుపై నుంచి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన వెంకన్నను 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మరణించాడు. 40 సంవత్సరాలుగా గీత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వెంకన్న కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

# కమ్యూనిస్టు ఉద్యమ ధ్రువతార గిరిప్రసాద్



**-లక్షలాది ఏకరాల భూమిని పేదలకు పంచిన ఘనత గిరిప్రసాద్**
**-సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**
**-సిపిఐ జిల్లా కార్యాలయంలో ఘనంగా నల్లమల 29వ వర్ధంతి**

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కార్మిక, కర్షక, పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నల్లమల గిరిప్రసాద్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని, భూపోరాటాలకు నాయకత్వం వహించి లక్షలాది ఎకరాలను పేదలకు పంచిన ఘనతగిరిప్రసాదుకు దక్కుతుందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, సిపిఐ మాజీ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి శనివారం శేషగిరిభవన్ లో ఘనంగా నిర్వహించారు. తొలుత గిరిప్రసాద్ చిత్రపఠానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాబీర్ పాషా మాట్లాడుతూ, అప్పటి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ధృవతారగా వెలుగొందిన గిరిప్రసాద్ జీవితం, ఆయన చేసిన త్యాగం నేటి తరం కార్యకర్తలకు, నాయకులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేఖంగా ఆంధ్ర మహాసభ సాగించిన ఉద్యమం గురించి అద్యయనం చేసి ఉన్నత విద్యను, ఆస్తులను సైతం వదిలివేసి ఉద్యమబాట పట్టిన నల్లమల సాయుధ పోరాటాన్ని బలోపేతం చేశాడని కొనియాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన గిరిప్రసాద్ జిల్లా అభివృద్ధికి, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాడన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలను నడిపించడంలో కీలకపాత్ర పోషించిన గిరిప్రసాద్ లేని లోటును పరిపూర్త చేయాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు. ఆయన చూపిన పోరాట మార్గంలో పయనిస్తూ నమ్మిన సిద్ధాంతాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించిన వాళ్లమవుతామని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు కొరిమి రాజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యు లు చంద్రగిరి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, జి.వీరాస్వామి,భూక్యా శ్రీనివాస్, కేశవరావు, రత్నకుమారిపాల్గొన్నారు.

# తుపాకి గుండ్లకు ఎదురొడ్డి నిలిచిన ధీశాలి గిరి ప్రసాద్



**-సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** కార్మిక, కర్షక, పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నల్లమల గిరి ప్రసాద్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా మిగిలిపోయాడని, భూ పోరాటాలకు నాయకత్వం వహించి లక్షలాది ఎకరాలను పేదలకు పంపిన ఘనత గిరిప్రసాద్‌కు దక్కుతుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు సిపిఐ మాజీ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శది, మాజీ రాజ్యసభ సభ్యులు నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి శనివారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత గిరిప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పటి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ధృవతారగా వెలుగొందిన గిరిప్రసాద్ జీవితం, ఆయన చేసిన త్యాగం నేటి తరం కార్యకర్తలకు, నాయకులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలను నడిపించడంలో కీలకపాత్ర పోషించిన గిరి ప్రసాద్ లేని లోటును పరిపూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేఖంగా ఆంధ్ర మహాసభ సాగించిన ఉద్యమం గురించి అధ్యయనం చేసి ఉన్నత విద్యను, ఆస్తులను సైతం వదిలివేసి ఉద్యమ బాట పట్టిన నల్లమల సాయుధ పోరాటాన్ని బలోపేతం చేశాడని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్వంచ తాలుకా కేంద్రంగా గెరిల్లా దళాలకు నాయకత్వం వహించిన ఆయన గిరి దళం పేరుతో గిరిజన ప్రాంతాల్లో ఉన్న పోడు భూమి సమస్యలు, భూ స్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో తన దళ సభ్యులు సోయం గంగులు, ఉయ్యాల పుల్లయ్య, కొంద్రు చిన్న నాగులు, తదితర సహచరులుగా పాల్వంచ, ములకలపల్లి, దమ్మపేట, బూర్గంపాడు, కొత్తగూడెం ప్రాంతాలలో దళాలు జరిపిన దాడుల్లో గిరి ప్రసాద్ నాయకత్వం వహించిన గొప్ప ఆదర్శ నాయకుడు అని, సిపిఐ పార్టీ రాష్ట్ర, జాతీయ ఉప కార్యదర్శిగా, ఎంఎల్‌ఏగా, యంపీగా ప్రజలకు సేవలను అందించారని కొనియాడారు. అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన గిరిప్రసాద్ జిల్లా అభివృద్ధికి, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశాడన్నారు. ఆయన చూపిన పోరాట మార్గంలో పయనిస్తూ నమ్మిన సిద్ధాంతాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించిన వాళ్లమవుతామని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, వీ పద్మజ, గుండాల నాగరాజు, ప్రజా సంఘాల నాయకులు చెన్నయ్య, అన్నరాపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, శానగరపు శ్రీను, నరహరి నాగేశ్వరరావు, మనేం వెంకన్న, నిమ్మల రాంబాబు, రామాచారి, బీవీ సత్యనారాయణ, కరీం, ఖాసీం, బిల్లా రంగయ్య, కృష్ణ, భీమా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ ఎరువుల ద్వారా భూసారాన్ని పెంచండి

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులంతా రసాయనిక ఎరువులు తగ్గించి కృత్రిమ ఎరువులు ద్వారా భూసారాన్ని పెంచి అధిక పెట్టుబడి తగ్గించి దిగుబడి సాధించాలని మండల వ్యవసాయశాఖ అధికారి నారెడ్డి సీతారామరెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం వ్యవసాయ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం తిరుమలాయపురం నందు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి రైతు భూసారాన్ని పెంచుకునేందుకు పచ్చిరొట్ట విత్తనాలు పొందాలని తెలిపారు. తిరుమలాయపాలెం వ్యవసాయ పరపతి నందు 250 క్వింటాళ్ల జిలుగులు, 150 క్వింటాళ్ళ జనుము, 5క్వింటాళ్ళ పిల్లి పెసర విత్తనాలు అందుబాటు ఉన్నాయని, జిలుగు ధర 30కేజిల బస్తా రూ.2137.50, జనుము 40కేజిల బస్తా రూ.2510, పెసలు 20కేజిల బస్తా రూ.2055 ప్రభుత్వం అందిస్తుందని, మండల రైతులు ప్రతిఒక్కరూ విత్తనాలు వాడి భూసారాన్ని పెంచుకుని పెట్టుబడి తగ్గించి అధిక దిగుబడి పొందాలని ఆయన తెలిపారు.

## రాహుల్ గాంధీ ఆశయసాధనకు కృషి చేద్దాం



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కీసర బాలవికాస కేంద్రంలో నిర్వహిస్తున్న వైట్ టీ షర్ట్ 3రోజుల శిక్షణ శిబిరం ముగిసింది. ముగింపు రోజు ముఖ్య అతిథులుగా పాల్గొన్న యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ యువజన కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతు.రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైట్ టీ షర్ట్ ఉద్యమం చాలా గొప్పదని, వైట్ టీ షర్ట్ ఐదు మార్గదర్శక సూత్రాలకు చిహ్నాం అన్నారు. కరుణ, ఐక్యత, అహింస, సమానత్వం, అందరికీ పురోగతిని ప్రతిభింబిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ వెన్నెముక లాంటిదని దేశవ్యాప్తంగా పార్టీ అభివృద్ధికి ఇది తోడ్పాటునిస్తుందన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన విధానాలను, కాంగ్రెస్ పార్టీ విధివిధానాలను యువజన కాంగ్రెస్ నాయకులు మరింత ముందుకు తీసుకెళ్లి దేశంలో బీజేపీ నియంత పాలనకు చరమగీతం పాడాలని సూచించారు. దేశం కోసం నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ఎన్నో త్యాగాలు చేశారని వారి వారసుడిగా రాహుల్ గాంధీ కూడా దేశ ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారని, ఆయన్ని ఆదర్శంగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేయాల్సిన యువజన కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలన్నారు. సోషల్ మీడియాలో కూడా యువత ముందు ఉండాలని కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం శిక్షణ శిబిరంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్ లను అందించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయుడు నల్లమల గిరిప్రసాద్



**ప్రజాపక్షం/ మధిర :** నమ్మిన సిద్ధాంతం కోసం కడవరూ పోరాడిన నల్లమల గిరిప్రసాద్ కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయుడని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని తొండలగోపారంలో నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద సిపిఐ పతాకాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాటి తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని, జమీందార్లు, జాగిర్లు, పెత్తందారులకు వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన పోరాడిన మహోనీయుడు నల్లమల గిరిప్రసాద్ అని కొనియాడారు. గిరి ప్రసాద్‌ను ఆదర్శంగా తీసుకుని కమ్యూనిస్టులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎం.ఎ.రహీం, పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు, మడుపల్లి లక్ష్మ ణ్, ఎఐటియూసి డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, మల్లారం శాఖ కార్యదర్శి పరుచూరి రాము, సహాయ కార్యదర్శి గరిడేపల్లి వెంకటేశ్వరావు, మడుపల్లిశాఖ సహాయ కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్ ఎంట్రన్స్‌లో సెయింట్ ఫ్రాన్సిస్ ప్రభంజనం



**ప్రజాపక్షం/ మధిర :** శనివారం ప్రకటించిన పాలిసెట్ ఎంట్రన్స్ ఫలితాల్లో పట్టణానికి చెందిన సెయింట్ ఫాన్సిస్ స్కూల్ ప్రభంజనం సృష్టించింది. విద్యార్థి కాజా హరిదీప్ 119/120 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంక్, జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం నిలిచాడని ప్రిన్సిపాల్ సిస్టర్ ఆన్‌బేబి తెలిపారు. ఇంజనీరింగ్ కంప్యూటర్ ఐఐటి కంప్యూటర్ సైన్స్ విభాగంలో మంచి నైపుణ్యం సాధించి సైంటిస్ట్ కావాలనేది ఈ విద్యార్థి ఆశయమని తెలిపారు. ఈ విజయాన్ని సాధించిన హరిదీప్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు కరస్పాండెంట్ సిస్టర్ మేరిథామస్, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు అభినందించారు.

## బాలాజీ వృద్ధాశ్రమంలో హెల్త్ క్యాంపు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండలంలోని జమలాపురం బాలాజీ వృద్ధాశ్రమంలో శనివారం హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు బిపి, షుగర్ టెస్టులు చేసి మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా తీసుకోవాల్సిన ఆహార నియమాలు, మెడిటేషన్ తదితర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పల్లెదవఖానా అధికారి సిహెచ్.కుమారి, హెల్త్ అసిస్టెంట్ డి.సాయిరెడ్డి, ఎఎన్ఎం అరుణ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్తకు దేహశుద్ది



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురంలో వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్తకు భార్య దేహశుద్ధి చేసిన సంఘటన జరిగింది. శనివారం వినాయకపురంకు చెందిన అబ్దుల్ హకీజ్ అనే వ్యక్తి తన ఇంట్లో భవాని అనే మహిళతో ఏకాంతంగా ఉండగా అతని భార్య ఫాతిమా పట్టుకుంది. కుటుంబసభ్యులతో కలిసి పట్టుబడిన ఇద్దరికి దేహశుద్ధి చేసి తాడుతో మొదట మంచానికి ఆతర్వాత ఇంటి ముందు కిటికి కట్టేసింది. భార్య ఫాతిమా మాట్లాడుతూ తన భర్త అబ్దుల్ హకీజ్ భవాని అనే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని తనను వేధింపులకు గురి చేశాడని, రెండేళ్లుగా తనని ఇద్దరి పిల్లల్ని పట్టించుకోవటంలేదని తెలిపింది. అక్రమ సంబంధం కారణంగానే భర్త తమ కుటుంబానికి దూరమయ్యాడని ఆరోపించింది. తనకు న్యాయం చేయాలంటూ భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని భర్త అబ్దుల్ హకీజ్‌తో పాటు భవాని అనే మహిళను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** రామన్నగూడెం గ్రామపంచాయతీలో సీతారామ కాలువ భూసేకరణ కోసం వచ్చిన అధికారులను శనివారం గ్రామస్తులు అడ్డుకొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రామన్నగూడెం గ్రామపంచాయతీలో 17సంవత్సరాల క్రితం వెంకమ్మ చెరువు వరద కాలువ నష్టపరిహారం మంజూరు చేయలేదని, రామన్నగూడెం గ్రామపంచాయతీ ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయలేదని, తక్షణమే మా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి మాకు తగిన న్యాయం చేయాలని కోరారు. అనంతరం సమస్యను పరిష్కరిస్తామని అధికారుల హామీతో ధర్నాను విరమించారు.

# గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**- పరీక్షల నిర్వహణపై సమీక్షించిన సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. శనివారం సిసిఎల్‌ఏ కమిషనర్ హైదరాబాద్ నుంచి గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ ఈనెల 25న ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు ఉదయం ఎనిమిది గంటల వరకు జవాబు పత్రాలను ఉదయం 9.20 గంటల వరకు ప్రశ్నా పత్రాలను తరలించాలన్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సరిగ్గా సీల్ చేసి జెఎన్‌టియుహెచ్ కు అందించాలని, ఉపయోగించని జవాబు పత్రాలను కూడా తప్పనిసరిగా పరీక్షా కేంద్రాల నుంచి సేకరించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. అభ్యర్థులకు అవసరమైన త్రాగునీరు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మేర ఇన్విజిలేటర్ నియమించాలని, అభ్యర్థులు ఏవిధమైన ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచీలు తీసుకు రావద్దన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో మెడికల్ టీం ఏర్పాటు చేయాలన్నారు. పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల రూట్‌లలో బస్సు నడపాలన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ పక్కల జిరాక్స్ షాపులు మూసివేయాలన్నారు. 144వ సెక్షన్ అమలు చేయాలన్నారు. జూన్ మూడు నుండి అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని, ప్రజల నుండి భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రతి మండలంలో రెండు బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఒక బృందానికి తహసీల్దార్, మరో బృందానికి నాయబ్ తహసీల్దార్లు నేతృత్వం వహిస్తారన్నారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద ప్రతి జిల్లాలో ఇప్పటికే ఒక్కో మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 253 మంది గ్రామ పాలన అధికారుల పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఎస్‌బిఐటిలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాల కల్పన చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారిణి నోడల్ అధికారిగా నియమించామన్నారు. పరీక్షా సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌డివో ఎ. పద్మశ్రీ, ఏవో అరుణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భారీగా గంజాయి పట్టివేత




**ప్రజాపక్షం/ఇల్లెందు:** విశ్వసనీయ సమాచారం మేరకు టేరకు పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా శనివారం 698కిలోల నిషేధిత గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. వివరాల్లోకి వెళ్లగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్ సమీపంలోని ఎసీఎ సులానగర్ మినిస్ట్రీ చర్చి వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలో ఎస్కార్టుగా వస్తున్న కార్ల నంబరు హెచ్‌ఆర్ 05బీకె6032, హెచ్‌ఆర్63ఈ7315 గల ఐచర్‌వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా దాదాపు 698కిలోలు రూ.3,49,00,000లు విలువగల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఐచర్‌వ్యాన్‌లోని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా నిషేధిత గంజాయిని అమ్మిన వ్యక్తులు, కొనుగోలు చేసిన వ్యక్తులు, రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి, కార్లను, 5మొబైల్స్‌లను సీజ్ చేశారు. ఆంధ్ర రాష్ట్రం సీలేరు అటవీప్రాంతం నుంచి హర్యానా రాష్ట్రం కురుక్షేత్ర ప్రాంతానికి అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. పట్టుబడిన నిందితులందరూ కురుక్షేత్ర జిల్లాకు చెందిన ప్రిన్స్‌కుమార్ ఆదేశాలతో పార్సిల్ సర్వీసు మాటున గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డారు. పట్టుబడిన ఆరుగురు నిందితులు సందీప్‌కుమార్(35),లక్విందర్(21), అమర్‌నాథ్ కుమార్(26), పవన్‌కుమార్(34), రాజ్‌కుమార్(33),కృషన్‌కుమార్(35), అమ్మిన వ్యక్తులు హరిఖారా, ప్రిన్స్‌కుమార్ లను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు నిషేధిత గంజాయి అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకుని నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ టీ.సురేశ్, ఎస్సై ఎ.రాజేందర్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, సిబ్బందిని ఎస్పీ రోహిత్‌రాజ్ ప్రత్యేకంగా అభినందించారు.

# వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెడతామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క హామీ ఇచ్చారు. సిపిఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం బృందం శనివారం వైరాలో జరిగిన జాబ్‌మేళాలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసి వైరా నియోజకవర్గ కేంద్రంలోని మౌలికమైన సమస్యలు పరిష్కారానికి నిధులు కేటాయించాలని, ఏన్కూరు మండలంలో సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ క్రింద భూములు కోల్పోయిన రైతులకు పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారం డబ్బులు విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వైరా నియోజకవర్గ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా డివిజన్ కమిటీ సభ్యురాలు మచ్చా మణి, సీనియర్ నాయకులు పారుపల్లి కృష్ణారావు, వైరా పట్టణ కమిటీ సభ్యులు కొంగర సుధాకర్, గుడిమెట్ల మోహన్‌రావు, రైతులు బానోతు రవి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



# జాబ్‌మేళాలో మంచినీటినందించిన లయన్స్, గ్రేట్ విజన్ క్లబ్‌లు

**ప్రజాపక్షం/వైరా:** వైరా జూనియర్ కళాశాలలో స్థానిక శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో లయన్స్‌క్లబ్ ఆఫ్ వైరా గ్రేట్ విజన్ క్లబ్ వైరా సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళాకు వచ్చిన విద్యార్థిని, విద్యార్థులకు అధికారులకు మంచినీటి బాటిల్స్ మంచినీటిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ 5వేలకు మందికి సరిపోను మంచినీరు అందించడం మంచి సేవా కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్‌లను కొనియాడారు. అనంతరం ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ క్లబ్‌ల సభ్యులు మంచినీటి కోసం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించి బాటిల్స్‌ను జాబ్‌మేళాకు వచ్చిన వారికి అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, వైరా సొసైటీ అధ్యక్షులు బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, జీఎస్టీ కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, లగడపాటి ప్రభాకర్ రావు, చింతోజు నాగేశ్వరరావు, వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరు రామకృష్ణ, అబ్బూరి రమేష్, మరికంటి రాంగోపాల్, గంగవరపు కిషన్, చెరుకూరు శ్రీనివాసరావు, ఏపూరి రాజారావు, గజ్జల కృష్ణమూర్తి, పులి కృష్ణార్జున్‌రావు, గద్వాల రవీందర్ తదితరులు మంచినీటిని అందించారు.



# మృతుని కుటుంబానికి బియ్యం వితరణ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామానికి చెందిన గొర్రె మాధవరావు ఇటీవల మృతిచెందారు. ఆ కుటుంబానికి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, గ్రామ మాజీ ఉప సర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు బియ్యం వితరణ చేశారు. మానవ సేవే మాధవ సేవ అని తలంచి గత ఎనిమిదేళ్లుగా గ్రామంలో కుల, మత రాజకీయాలకు అతీతంగా గుత్తా వెంకటేశ్వర్లు సమాజ సేవ చేస్తున్నారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబాన్ని పరామర్శించి తన వంతు సాయంగా 50 కేజీల బియ్యాన్ని వితరణగా అందిస్తున్నారు. శనివారం ఇటీవల మృతిచెందిన మాధవరావు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి 50 కేజీల బియ్యాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. గుత్తా వెంకటేశ్వరరావు అందిస్తున్న సేవలను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గంగిరెడ్డి విజయ్‌రెడ్డి, గుండ్ల ముత్తయ్య, సచ్చు వీరబాబు, మాధవరావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వైరా పోలీస్‌స్టేషన్‌లో ఐదుగురు కానిస్టేబుల్‌లు బదిలీ

**ప్రజాపక్షం/వైరా:** వైరా పోలీస్‌స్టేషన్‌లో గత కొన్ని సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్న ఐదుగురు కానిస్టేబుల్ శనివారం జిల్లా వ్యాప్తంగా జరిగిన బదిలీ అయ్యారు. సయ్యద్ కూసుమంచికి, విజయరావు వేంసూరుకు, బాల్య ఖమ్మం ట్రాఫిక్‌కు, రంగారావు ఖమ్మంకు చిరంజీవి ఖమ్మం ట్రాఫిక్‌కు బదిలీ అయ్యారు. విధి నిర్వహణలో ఐదుగురు కానిస్టేబుల్‌లు ప్రజల్లోను అధికారుల్లో చక్కటి పేర్లు సంపాదించుకున్నారు.

# పునరావాసం, పరిహారం చెల్లించకుంటే జేకేఓసీని అడ్డుకుంటాం



**ప్రజాపక్షం/ఇల్లెందు:** పునరావాసం, పరిహారం చెల్లించకుంటే జేకేఓసీని అడ్డుకుంటామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య హెచ్చరించారు. స్థానిక ఏరియా జీఎం కార్యాలయంను సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్‌నబీ అధ్యక్షతన అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం ముట్టడించి, సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏరరియా జీఎం వి.కృష్ణయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..భూసేకరణ చట్టం 2013ప్రకారం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం అందించాలని, సింగరేణి ఓసీ మినహా మిగిలిన క్వార్టర్లను, సొంత ఇళ్ల భూమిని రెవెన్యూకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఓసీ ప్రభావిత ప్రాంతాల్లో సింగరేణి సంస్థ అభివృద్ధి చేపట్టాలని, ఆప్రాంత యువతకు ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సింగరేణి ఓసీ ప్రభావిత ప్రాంత ప్రజల బాగోగులు చూడకుంటే ఓసీ పనులు సాగనివ్వమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె.వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసీ నేతలు తోడేటి నాగేశ్వరరావు, రాంసింగ్, బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ దాస్యం ప్రమోద్, తెదేపా క్లింట్‌రోచ్, మాజీ ఎంపీటీసి పూనెం సురేందర్, విజయలక్ష్మీ నగర్ మాజీ సర్పంచి పూనెం కవిత, వి.శ్రీనివాస్, జి.మొగిలీ, ఎస్.మహేశ్, తాళ్లూరి కృష్ణ, దనసరి పగిడిద్దరాజు, పి.సారంగపాణి, ఎం.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో మెగా జాబ్‌మేళా విజయవంతం



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చొరవతో చేపట్టిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. ఉదయం నుంచే జాబ్‌మేళా ప్రాంగణం నిరుద్యోగ యువతతో నిండిపోతుంది. ఆన్‌లైన్‌లో సుమారు 8500 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేయించుకోగా, ఆన్‌లైన్‌లో 1500 పైగా రిజిస్ట్రేషన్ చేర్చుకున్నారు. సుమారు 80 కంపెనీలు, ప్రతినిధులు, నిరుద్యోగులకు జాబ్ కల్పించేందుకు ఇక్కడికి తరలించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఇబ్బందులు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జాబ్‌మేళా వద్ద విద్యార్హతను బట్టి కౌంటర్లు వారీగా ఇంటర్వ్యూ ఏర్పాట్లు చేశారు. జాబ్‌మేళా కార్యక్రమం వద్ద హెల్త్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసి మందులను అందుబాటులో ఉంచారు. ఏది ఏమైనా తొలిసారి వైరాలో జరిగిన మెగా జాబ్ మేళాలకు విశేష స్పందన రావడం నిరుద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచింది. గత కొన్ని రోజులుగా వివిధ శాఖల అధికారులు కాంగ్రేస్ జాబ్‌మేళా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. జాబ్‌మేళా విజయవంతంతో సంతోషం వ్యక్తంచేశారు.

# పట్టుబడిన గంజాయి దహనం

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మం కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నిషేదిత గంజాయిని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ నేతృత్వంలో శనివారం శాస్త్రీయ పద్ధతిలో దహనం చేసినట్లు పరిపాలన విభాగం అడిషనల్ డిసిపి నరేష్ కుమార్ తెలిపారు. ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్, రూరల్, ఖానాపురం హవేలీ, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, వైరా, తల్లాడ, సత్తుపల్లి, వివిఎం బంజర, వేంసూరు, ఏన్కూర్ పోలీసు స్టేషన్లకు సంబంధించిన 17 కేసుల్లో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ, విక్రయిస్తూ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిసిపి తెలిపారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న 90.706 కిలోల ఎండు గంజాయిని సీజ్ చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గెజిట్ నోటీఫికేషన్ల ఆధారంగా పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. తల్లాడ మండలం గోపాల్‌పేట గ్రామంలో ఉన్న ఏడబ్ల్యూఎం కన్సల్టెన్సీ బయోవెస్టేజ్ బర్నింగ్‌ప్లాంట్‌లో గంజాయిని దహనం చేసినట్లు పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసిపి రవి పర్యవేక్షణలో జరిగిన దహనంలో సిసిఆర్బీ సిఐ స్వామి, తల్లాడ ఎస్సై కొండలరావు ఇతర అధికారులు పాల్గొన్నట్లు డిసిపి తెలిపారు.

# గిరిప్రసాద్ 29వ వర్ధంతి సభ దృశ్యమాలిక

















